# అద్దెకొంప

## "రవి"

"ఏమోయ్! ఇన్నాళ్లూ సత్రవ భోజనం మఠం నిద్రగా సరిపోయింది. ఇక అలా జరగడానికి వీలులేనట్లుగా కనిపిస్తోంది. రేపు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వస్తున్నామని కాంతం ఉత్తరము వ్రాసింది" అన్నారు ముని మాణిక్యం గారు. సరే అయితే యేదైనా అద్దెకొంపొకటి చూడండి అన్నాను.

ఇన్ని కాఫీనీళ్లు గొంతులో పోసుకొని అద్దెకొంపల వేటకై బయలుదేరాము. కాళ్లు అరిగిపోయేలా తిరిగి తుదకు యెలాగైతేనేం కొలంబస్ అమెరికాను కనిపెట్టినట్లుగా '*To let*' అనే బోర్డును కనిపెట్టాము. ఆ బోర్డును చూడగానే వారి కెట్లున్నదో కాని నాకు ప్రాణాలు లేచివచ్చాయి. ఎందుచేతనంటే తిరిగి తిరిగి విసువెత్తి వున్నాను గనుక. పొందికగా వ్రాసిన '*Tolet*' అనే ఆ యింగ్లీషు అక్షరాలు, దాని క్రిందనే 'అద్దెకివ్వబడును' అనే తెలుగు అక్షరాలవంక నడుముమీద చేతులు పెట్టుకొని తల నీటుగా పైకెత్తి యెంతో ఆప్యాయనంగా చూస్తున్నాను. ఇంతలో వెనక నుండి ఎవరో "మీరు ఆడవాళ్ళు లేరంటయ్యా! ఆడవాళ్ళవంక అలా దేవిరిచ్చుకొని చూస్తారేం?" అన్నాడు. అంతవరకైతే నేను చూడలేదుగాని తల కొంచెము ప్రక్కకు త్రిప్పి చూచేసరికి మేడమీద నలుగురు ఆడవాళ్లు పచ్చీసుగళ్ళు ఆడుకొంటున్నారు. ఇలా వెనక్కు తిరిగి ఆ మనిషివంక చూచాను. నా గుండె జల్లుమన్నది. ఆ బుగ్గ పుస్తీలు, ఆ జుట్టుముడి, ఆ కనుబొమలు చూచేసరికి యెక్కడో జ్యూలోనుండి తప్పించుకొని వచ్చిన జంతువులా తోచింది. నోట మాట రాలేదు. నా అవస్థచూచి ముని మాణిక్యంగారు వెంటనే "మేము ఆడవాళ్ళను చూడడానికి రాలేదండి. ఇల్లు అద్దెకివ్వబడును అని బోర్డుంటే దానివంక చూస్తున్నాం" అన్నారు.

"అయితే మీకు యిల్లు అద్దెకు కావాలన్నమాట. మరి ఆమాట చెప్పరేం లోపలికి దయచేయండి." అంటూ మమ్మలను లోపలకు తీసుకొనిపోయి కూర్చోండని ఒక కుర్చీ చూపించాడు. తిరిగి తిరిగి వున్న కారణంగా మునిమాణిక్యంగారు గబుక్కున కుర్చీలో కూలబడ్డారు. కుర్చీ ప్రక్కకు పడిపోయింది. వారి తల నేలకు కొట్టుకొన్నది. ప్రాణం కడబట్టింది. నేను వెంటనే చెవులు మూశాను. అతను లోపలకుపోయి గ్లాసుతో మంచినీరు తెస్తూ 'పొరపాటు జరిగింది క్షమించండి. ఆ కుర్చీకి మూడే కాళ్లు. ఆమాట చెప్పడం మరచిపోయాను. క్షమించండి." అన్నాడు. మంచినీరు త్రాగించిన తరువాత కొంచెము సేపటికి తేరుకొన్నారు.

"ఇదిగో యీ భాగమేనండి అద్దెకిచ్చేది. ఇదిగో యిది వంటగది. ఇది పడకగది." అంటూ అతను చెప్పుకు పోతున్నాడు. "అయితే లెట్రినో" అన్నాను నేను.

"లెట్రిక్ పబ్లిక్ లెట్రి నుపయోగించుకోవాలిసిందే కాని మా లెట్రి నుపయోగించుకోవడానికి వీలులే" దన్నాడు. "అయితే యింతకు తమ ఉద్యోగమేమిటో సెలవిచ్చారు కా" రన్నాడు.

"కాలేజీలో పంతుల్ని" అన్నారు మునిమాణిక్యంగారు.

'కాలేజీలో పంతులవా? అయితే పరవాలేదు బాబూ! ఎందుచేతనంటే ఉత్సాహవంతులైన యువతీ యువకులతో తిరుగుతుంటారు గనుక మీ భావాలు ఉదాత్తంగానూ, ఉన్నతంగానూ, విశాలంగానూ వుంటాయి. అద్దె అడగకముందే పారేస్తారు. మళ్ళీ కమిటీస్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్ల పంతుళ్లున్నారే, వాళ్లకు యిల్లు అద్దెకివ్వగూడదు. వాళ్లకు జీతాలుసరిగా రానూ రావు; మన కివ్వనూ యివ్వరు. పోనీ వాళ్లు అద్దె సకాలంలో యివ్వకపోయినా గట్టిగా అడిగితే ప్రాణం పోయేవాడిలా చేతులు నలుపుకొంటూ ఎంతో వినయంగా రేపో మాపో యిస్తామని ప్రాధేయపడతారు. ఇక పోలీసు శాఖోద్యోగులకు, ఇన్‌కంటాక్సు వాళ్ళకు యిల్లు అద్దెకిచ్చామా చచ్చామన్నమాటే. వాళ్ళు అద్దెయివ్వరు. ఇల్లు ఖాళీ చేయమంటే చేయరు. పైగా గట్టిగా అడిగితే న్యూసెన్సుకేసులు పెడతామనీ, ఇన్‌కంటాక్సు తగిలిస్తామనీ బెదరిస్తారు. అలాంటివాళ్ళను నమ్మి ఇల్లు అద్దెకివ్వగూడదు. ముందుగానే చెపితే మంచిదని చెపుతున్నాను."

"ఈ సొదంతా యెందుకయ్యా యింతకూ అసలు విషయ మేమిటో తేల్చ"మన్నారు మునిమాణిక్యంగారు.

"అలా కోపపడితే యెలా చెప్పబాబు. ముందుగా చెపితే మంచిదని చెపుతున్నాను. నాలాంటి పెద్దమనిషి, యిలాంటి యిల్లు మీకీ వూరంతా తిరిగినా దొరకవు. అయితే చూడండి బాబూ! తమ కేమిటి,

సుగంధ చర్మరక్షణ మలాము
సాంటలక్స్
SANTALUX SKIN OINTMENT
మొటిమలు, కాటులు, తెగగడ్డలు, గజ్జి, తామర మొదలగువాటికి
అందమైన పొడుగైన కేశములకు
కాశ్మీర్‌కుసుం (పుష్ప మూలికలు)
ఇష్టమైన నూనెలో కలుపుకొనండి
మైసూర్ ఎం. ఆర్. జెట్టప్పావారి
ప్రేమశీలా
దర్బార్, అగర్, అంబర్, మొదలైనవి.
స్వాభావిక, పరిశుద్ధ యూనికార్న్ తేనె
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్, 54. బంధరు వీధి, మద్రాసు-1.
విజయవాడ బ్రాంచి: 16/46, నాగేశ్వరరావుపంతులురోడ్డు, సత్యనారాయణపురము,
మా అపూర్వమైన ఔషధముల జాబితాలకు వ్రాయండి.

పంతులుద్యోగమని కాదూ సెలవిచ్చారు. అయితే శని ఆదివారాలు తప్ప తతిమ్మా అయిదురోజులు కాలేజీకి వెళ్లవలసినదేగా?

"ఆఁ."

"అయితే ఉదయాన్నే యేడుగంటలకే లేచి స్కూలుకు వెళ్లాలిగా?"

"అవును."

"ఏమీ లేదండి ముందుగానే చెపితే మంచిదని చెపుతున్నాను. మీరు ఉదయాన్నే స్కూలుకు వెళ్ళగానే యిక మీవారు రేషను అయిపోయిందికొంచెము తెచ్చిపెట్టడం నో, స్టోర్సులో పంచదారయిస్తున్నారట కొంచెము తెచ్చిపెట్టండనో, మార్కెట్టుకు వెళ్లిండనో, అమ్మాయి జలుబుచేసింది, కొంచెము డాక్టర్ను పిలవండనో మా దుంప తెంచుతారు. అందుకని ముందుగానే చెపితే మంచిదని చెపుతున్నాను."

"విడిచినట్టే వున్నది. ఒక్క చోటవున్న తరువాత వొకరికొకరు సహాయపడకపోతే యెలాగయ్యా! మీకు యిబ్బందివస్తే మేము, మాకు యిబ్బంది వస్తే మీరూ సర్దుకోవాలి."

"ఒకనాడు రెండురోజులైతే ఎలాగైనా సర్దుకోవచ్చు. వారానికి అయిదురోజులు. సరేకాని తమకు కుక్కపిల్లలు గాని, పిల్లులు గాని యేమైనా..?

"అలాంటివేమీ లేవయ్యా!"

"అలా కోపపడతారేం బాబూ! ముందుగా చెపితే మంచిదని చెపుతున్నాను. కుక్కలూ, పిల్లులూ వుంటే ఇదిగో మీ పిల్లి మా పాలకుండ పడదోసినదనో, మీ కుక్కపిల్ల మా పిల్లవాని అన్నంలో కలియబడి తిన్నదనో యింటి మీదకు తగాదాలు తెస్తవి. అందుకని ముందుగా చెపితే మంచిదని చెప్తున్నాను."

"అసలు విషయం చెప్పకుండా యీ వెధవ సోదంతా యెందుకయ్యా?" అంటూ ముఖం చిట్లించుకొన్నారు మునిమాణిక్యంగారు.

"ఏదో వెనకటి కాలపు వాడిని గనుక నాదంతా వెధవ సోదిగానే కనిపిస్తుంది మీకు. సరే కాని మీకు నస్యం పీల్చే అలవాటుకాని, పొగాకు నమిలే అలవాటు గాని యేమైనా వున్నాయా? ఏమీ లేదండి. ముందుగానే చెపితే మంచిదని చెపుతున్నాను. ఎక్కడ బడితే అక్కడ పొట్టున చీది, తుపుక్కున వూస్తారని నా అనుమానం. అందుకని అడుగుతున్నాను."

ఈ మాటతో మునిమాణిక్యంగారికి కోపం వచ్చింది. చివాలున లేచారు. దారి పట్టారు. తొందరగా పోవడములో గడప నెత్తికి కొట్టుకొన్నది. బొప్పి కట్టింది. కండ్లవెంట నీరు తిరిగాయి. అయినా తిరిగి చూడకుండా దారిపట్టాం.

"ఏమేవ్. ఈయన ఎవరో కండ్లజోడున్నా కనిపించక దరవాజాకు కొట్టుకొన్నాడు. దరవాజా పడిపోయింది." అనే మాటలు వెనకనుండి వినిపించాయి.

సరాసరి స్టేషనుకు వెళ్లారు. కాంతం గారప్పటి కప్పుడే రైలుదిగి మునిమాణిక్యం వారికోసర మెదురుచూస్తున్నది.

[నేను పెట్టిన తిప్పలన్నీ పడి నా కథానాయకుడుగా కుదిరిన మునిమాణిక్యం గారికి అంకితం] ★



HVM. 169-50 TL